ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 148 | గురువారం 26 ఫిబ్రవరి 2026 | పేజీలు -6 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

## న్యాయవ్యవస్థలో అవినీతి

- పాఠ్యాంశంపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు..
- వెంటనే తొలగిస్తామని ప్రకటించిన కేంద్రం....




**న్యూఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి' అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో కేంద్రం వెంటనే స్పందించింది. పాఠ్యాంశం లోని భాగాలను తొలగించేందుకు నిర్ణయించింది. పాఠ్యాంశంలో ఆవిధంగా వచ్చి ఉండాల్సింది కాదని, దీనికి బదులు స్ఫూర్తిదాయకమైన విషయాలను రాసి ఉండాల్సిందని కేంద్రం అభిప్రాయపడినట్టు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం న్యాయవాదులు, న్యాయమూర్తులందరినీ కలవరానికి గురి చేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'కొన్ని రోజులు ఆగండి. దీనిపై (మిగతా 2లో)

## వెలిగొండను పూర్తీ చేసి
# రైతుల కష్టాలుతీరుస్తా

- వెలిగొండ పూర్తి కాకుండానే రజగన్ రిబ్బన్ కట్..
- పనులు పూర్తయ్యాయని దొంగమాటలతో మోసం..
- వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా..
- పనిచేసే ప్రభుత్వాని అండగా ఉండాలి..
- ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేశా..
- వెలిగొండ ప్రాజెక్టు పనులు పరిశీలించిన చంద్రబాబు..



**మార్కాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**

జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ పనులు పూర్తి అయ్యాయని జగన్ దొంగ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. పనులు పూర్తికాకుండానే జగన్ రిబ్బన్ కటింగ్ చేశారని సెటైర్లు గుప్పించారు. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. బుధవారం మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మార్కాపురం జిల్లా ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఏపీకి పూర్వ వైభవం వస్తుందని వ్యాఖ్యానించారు. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పానని.. మాట నిలబెట్టుకున్నా నని, అలాగే మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని కోరారు. ఏపీకి మేలు చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కలిశామని ప్రస్తావించారు. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు కూటమిదే హవానని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాలో నూరుశాతం స్ట్రైక్‌రేట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా.. మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మదనపల్లెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా.. చేశానని ప్రస్తావించారు. మూడు వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చానని తెలిపారు. 1995లో మార్కాపురం ప్రజల కష్టాలు తాను చూశానని గుర్తుచేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించామని చెప్పారు. మార్కాపురం వెనుకబడిన ప్రాంతమని.. 1996 మార్చి 5వ తేదీన ఈ ప్రాంతానికి వచ్చానని.. ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీళ్ల కనిపించేవని గుర్తుచేశారు. తమకు శ్రీశైలం నీళ్లు కావాలని ఆనాడు ప్రజలు అడిగారన్నారు. కృష్ణా జలాలు తీసుకొస్తానని ఆరోజు మాట ఇచ్చానని.. వెలిగొండకు ఫౌండేషన్ తానే వేశానని.. పూర్తిచేసే అవకాశంతనకే వచ్చిందని పేర్కొన్నారు. ఒట్టి మాటలు చెప్పి మోసం చేయడం 2లో

## వేంపల్లె నందీశ్వరాలయంలో ప్రతిష్ఠ
# ప్రత్యేక పూజల్లో జగన్



**పులివెందుల (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**

వైసిపి అధినేత వైఎస్ జగన్ రెండో రోజు పులివెందులలో పర్యటించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని వైఎస్ జగన్ సందర్శించారు. నందీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా (మిగతా 2లో)

## ఆల్మట్టి ఎత్తుపై మౌనం
# ఎందుకు



- అసెంబ్లీలో చర్చించి స్పష్టత ఇవ్వాలని డిమాండ్..
- అనంతపురం, కర్నూలు జిల్లాలకు నీటి కష్టం తీవ్రం..
- ఆల్మట్టి ఎత్తు పెంపుతో భవిష్యత్తులో సీమకు తీవ్ర నష్టం..
- మాజీ మంత్రి శైలజానాథ్..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**

పొరుగు రాష్ట్రాల నిర్ణయాల వల్ల రాయలసీమ ప్రాంతానికి తీవ్ర నీటి కష్టం తలెత్తిందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు చేపడుతున్న ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. (మిగతా 2లో)

## గ్రూప్-1 అక్రమాలపై
# హైకోర్టు సీరియస్



- 2018 పరీక్షలపై సిట్ దర్యాప్తు వేగం..
- అప్రాధాన్య పోస్టులకు మార్పుపై ప్రభుత్వ ఉత్తర్వులు..
- సాయంత్రం 7లోపు నివేదిక ఇవ్వాలని సీఎస్ ఆదేశం..
- కోర్టు ఆదేశాల అమలులో జాప్యంపై అసంతృప్తి..
- నియామకాల భవిష్యత్తుపై ఉత్కంఠ..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**

ఏపీలో 2018లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలు రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. హైకోర్టు ఆదేశాలతో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ కొనసాగిస్తున్న వేళ, తాజాగా మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. అప్పట్లో ఉద్యోగాలు పొందిన అధికారులను కీలక పోస్టుల నుంచి అప్రాధాన్య పోస్టులకు మార్చాలంటూ గత విచారణలో హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్‌ను కోర్టుకు హాజరుకావాలని ఆదేశించి వివరణ కోరినట్లు సమాచారం. కోర్టు ఆదేశాల అమలులో జాప్యం ఎందుకు జరిగిందన్న దానిపై సీఎస్‌ను నేరుగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ స్పందన చూపింది. 2018 గ్రూప్-1 పరీక్షలో ఉత్తీర్ణులై ప్రస్తుతం వివిధ శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులను వెంటనే అప్రాధాన్య పోస్టుల్లోకి మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయగా, సంబంధిత అధికారులను తక్షణమే బదిలీ చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. సదరు అధికారుల బదిలీలపై అమలు నివేదికను బుధవారం సాయంత్రం 7 (మిగతా 2లో)

## పీఏసీఎస్ ఉద్యోగులకు
# 20 శాతం జీతాల పెంపు

- సమ్మె నిర్ణయం ఉపసంహరించుకున్న ఉద్యోగులు..
- గ్రాట్యుటీ రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంపు..
- ప్రతి ఉద్యోగికి రూ.5 లక్షల సమగ్ర గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్..
- డిమాండ్లపై చర్చల అనంతరం మంత్రి హామీ..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**

రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్)లో పని చేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వారి జీతాలను 20 శాతం పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన చర్చల్లో స్పష్టమైన హామీ ఇచ్చారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ అంశంపై జరిగిన సానుకూల చర్చల ఫలితంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జీతాల పెంపుతో పాటు ప్రస్తుతం ఉద్యోగులకు అందిస్తున్న రూ.2 లక్షల గ్రాట్యుటీని రెట్టింపు చేస్తూ రూ.4 లక్షలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.. దీని ద్వారా పదవీ (మిగతా 2లో)

## మళ్లీ వస్తామంటే..!
# చెప్పు దెబ్బలే

- పదవుల కోసం పార్టీ మారిన వారిపై ఘాటువిమర్శలు..
- బంధుత్వం పేరుతో వచ్చినా చేర్చుకోమన్న స్పష్టం..
- విధేయులకే పార్టీలో గౌరవ స్థానం..
- వెన్నుపోటు రాజకీయాలకు తావులేదని హెచ్చరిక..
- ధర్మవరంలో సమావేశం రాజకీయ చర్చకు దారితీసిన కేతిరెడ్డి వ్యాఖ్యలు...



**ధర్మవరం (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అధికారాన్ని అనుభవించి, కష్టకాలంలో పార్టీని వీడి కూటమి గూటికి చేరిన నాయకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ధర్మవరంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని లాభాలు పొందిన కొందరు నేతలు, పరిస్థితులు మారగానే పార్టీని వీడి వెళ్లడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. "మన దగ్గర ఉండి సంపాదించుకుని, ఇప్పుడు పదవుల కోసం వెళ్లిన వారిని మళ్లీ రానిచ్చే ప్రసక్తే లేదు. వస్తామంటే చెప్పు దెబ్బలే" అంటూ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. బంధుత్వాలు, స్నేహాలు, పరిచయాలు పేరుతో తిరిగి పార్టీలోకి రావాలనుకునే వారికి తలుపులు మూసుకుపోయాయని స్పష్టం చేశారు. "ఎదురుగా నిలబడి పోరాడే శత్రువునైనా గౌరవిస్తాం. అవసరమైతే చర్చిస్తాం. కానీ మన దగ్గరుండి లాభాలు పొందుతూ, కష్టకాలంలో పార్టీని ముంచేసి వెళ్లిన వారిని మాత్రం అసలు దగ్గరకు రానివ్వం" అని అన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలు అత్యంత ముఖ్యమని, పదవుల కోసం వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టే రాజకీయాలకు తాను వ్యతిరేకమని కేతిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా వెన్నంటి నిలిచిన కార్యకర్తలే నిజమైన బలం అని అన్నారు. అలాంటి విధేయులకే భవిష్యత్తులో ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారిని మరువబోమని, పదవుల కోసం వెళ్లిన వారిని నమ్మే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. కేవలం ఆర్థిక ఆదాయం కోసమే కాకుండా రాజకీయాల్లో వ్యక్తిత్వమే అసలైన మూలధనం అని, దాన్ని కోల్పోయిన వారికి పార్టీ తలుపులు శాశ్వతంగా మూసుకుపోయాయని స్పష్టం చేశారు.

## ఉచితబస్సు పథకంలో
# దివ్యాంగులకు గ్రీన్ సిగ్నల్

- 40% పైగా వైకల్యం ఉన్నవారికి ఉచిత ప్రయాణం..
- ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్ల ఆర్థిక సాయం..
- ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్‌తో ఉచిత బస్సు..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**

ఏపీలో ఉచిత బస్సు పథకం మరింత విస్తరించింది. ఇప్పటివరకు మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు మాత్రమే పరిమితమైన ఈ పథకాన్ని ఇకపై దివ్యాంగులకు కూడా అమలు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అసెంబ్లీలో అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సిటీ ఆర్డినరీ, సిటీ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు సహా ఐదు రకాల ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 47 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయని వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1660 కోట్ల సబ్సిడీ భరించినట్లు చెప్పారు. ఉచిత బస్సు పథకం కారణంగా మహిళా ప్రయాణికుల శాతం 40 శాతం నుంచి 65 శాతానికి పెరిగిందని మంత్రి వివరించారు. రోజుకు సగటున 25 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని వెల్లడించారు. ఇకపై 40 శాతం పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులకు కూడా ఉచిత (మిగతా 2లో)

## పరిశీలన పూర్తయ్యాకే
# ఆడబిడ్డ నిధి అమలు

- విధివిధానాల ఖరారు ప్రక్రియ కొనసాగుతోందన్న మంత్రి..
- అంచనాలు పూర్తయ్యాక నిర్ణయం తీసుకుంటామని స్పష్టం..
- సభలో ఆందోళనకు దిగిన ప్రతిపక్ష సభ్యులు..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో మరో కీలక దశకు చేరుకుంది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఉన్న 'ఆడబిడ్డ నిధి' పథకం అమలుపై ప్రభుత్వం శాసనమండలి వేదికగా స్పష్టత ఇచ్చింది. ఇప్పటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేసిన ప్రభుత్వం, మిగిలిన రెండు ప్రధాన హామీలైన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అమలుపై పరిశీలన కొనసాగుతోందని తెలిపింది. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అలాగే నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 భృతి చెల్లిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ఈ రెండు పథకాలు మాత్రమే సూపర్ సిక్స్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. 'ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారు? నిజంగా ఇచ్చే ఉద్దేశం ఉందా?' అని ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు (మిగతా 2లో)

# రైతుల కష్టాలు తీరుస్తా



(మొదటి పేజీ (తరువాయి)

తనకు రాదని చెప్పుకొచ్చారు. 2014 వరకు వెలిగొండ పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. వెలిగొండతో 4 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులని పరిశీలించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కెనాల్‌లో సీఎం చంద్రబాబు తిరిగారు. స్థానికంగా ఏపీ పంటలు పండిస్తున్నారో అన్నదాతలని అడిగి తెలుసుకున్నారు. లైనింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిలో వేగం పెంచాలని మార్గనిర్దేశర చేశారు. అలాగే, వెలిగొండ రెండో టన్నెల్‌లో పని చేస్తున్న ఇంజనీర్స్‌తో లైవ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టన్నెల్‌లో లైనింగ్ పనులని లైవ్‌లో పరిశీలించారు. జూన్ 15వ తేదీ నాటికి టన్నెల్‌లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తానని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రతి సోమవారం వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంచి చేసిన వారికి అండగా ఉంటేనే మీ జీవితాలు మారతాయి. ప్రతి విషయంలో మీకు అండగా చంద్రన్న ఉంటాడు. మార్కాపురం జిల్లాను ఉద్యానవనంగా తయారు చేస్తాం. పండ్లతోటల వల్ల రైతుల ఆదాయం బాగా పెరుగుతుంది. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించా. ఈ ఏడాది వెలిగొండపై దృష్టి పెట్టానని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్మట్టి ఎత్తుపై మౌనం ఎందుకు

(మొదటి పేజీ (తరువాయి)

ప్రస్తుతం రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయని గుర్తుచేస్తూ, రాయలసీమకు ఏర్పడిన నీటి సంక్షోభంపై సభలో విస్తృతంగా చర్చించాలని కోరారు. ముఖ్యంగా అనంతపురం, కర్నూలు జిల్లాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. తాము లేవనెత్తిన అంశాలను సభలో చర్చించి స్పష్టమైన హామీ ఇవ్వాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపు విషయాన్ని ప్రస్తావిస్తూ, గతంలో అది కేవలం ఆనకట్టగా ఉన్నప్పటికీ తర్వాత నిల్వ సామర్థ్యం భారీగా పెరిగిందన్నారు. ప్రస్తుతం మరింత ఎత్తు పెంచి అదనపు నీటిని నిల్వ చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయని చెప్పారు. అనేక అంశాలపై మాట్లాడే ముఖ్యమంత్రి ఈ విషయంలో మాత్రం మౌనం పాటించడం ఆశ్చర్యకరమని విమర్శించారు. దీంతో అనంతపురం, కర్నూలు జిల్లాల ప్రజల్లో ఆందోళన పెరుగుతోందన్నారు. ఆల్మట్టి వద్ద అధిక నిల్వ కారణంగా జూన్, జూలై నెలల్లో రావాల్సిన వరద నీరు ఆలస్యంగా దిగువకు చేరుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత నిల్వ పెరిగితే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా నీరు అందకపోవచ్చని హెచ్చరించారు. ఎగువ నుంచి నీరు రాకపోతే రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. అప్పర్ తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా చేసే ప్రణాళికల ప్రభావం కూడా ప్రాంతంపై పడవచ్చని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో నెల్లూరు, ప్రకాశం జిల్లాలు కూడా దుర్భిక్షాన్ని ఎదుర్కొనే అవకాశముందని తెలిపారు. తుంగభద్ర డ్యామ్, హెచ్ఎన్ఎస్ఎస్, ఎల్ఎల్సీ ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. వేదావతి నదిపై కొత్త నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధనలు ఉన్నాయని గుర్తుచేశారు. రాయలసీమకు దీర్ఘకాలిక నీటి భద్రత కల్పించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను శాసనసభలో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేతపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఈ నిర్ణయంతో లక్షల ఎకరాల ఆయకట్టుకు అనిశ్చితి నెలకొంటుందని అన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులు చేపడుతుంటే చివరకు శ్రీశైలం జలాశయానికి నీరు చేరుతుందా లేదా అన్న సందేహం ప్రజల్లో ఉందన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీరు తీసుకోవాలంటే అవసరమైన నీటి మట్టం ఉండాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పూర్తి చేసి, బనకచర్ల ఎత్తిపోతల సహా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ విజ్ఞప్తి చేశారు

# కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ

## దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి
## పసిపాప కుటుంబానికి కెటిఆర్ పరామర్శ



నాగర్‌కర్నూల్ (తెలుగోడు), ఫిబ్రవరి 25 :

నాగర్ కర్నూల్ జిల్లాలో ఇటీవల కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన గొడవలో రెండు నెలల చిన్నారి మృతిచెందిన ఘటనలో దోషులు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కెటిఆర్ పరామర్శించారు. తమకు న్యాయం చేయాలని చిన్నారి కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. బాధిత కుటుంబం ఆందోళన చేస్తున్న శిబిరం వద్దకి వెళ్లి వారితో మాట్లాడి ధైర్యం చెప్పారాయన. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఘోరాతి ఘోరమైన మానవత్వానికి మచ్చ తెచ్చే విధంగా చిన్నారిని హత్యచేశారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల పసిగుడ్డు ప్రాణాలు తీసిన హంతకులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. మల్లన్న జాతరలో చిన్నారి తల్లి దర్శనం అడిగినందుకు ఆ పాపను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. దేవుడు దర్శనం అడిగిన పాపానికి.. దాడి చేసి మానవత్వానికే మచ్చ తెచ్చారని ఆగ్రహించారు. ఈ దారుణానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్ష పడాల్సిందేనని హెచ్చరించారు. పసిగుడ్డు ముఖం చూసి తండ్రిని వదలిపెట్టమని ప్రాధేయపడ్డ.. వదలకుండా కాలితో ఆ పాపను తన్నితే చనిపోయింది. యూనిఫామ్‌కి విలువ లేకుండా హంతకులను కాపాడే ప్రయత్నం పోలీసులు చేస్తున్నారు. రెండు నెలల పసిగుడ్డుకు కులం తెలుసా..?, మనుషులను చిన్నచూపు చూసి దర్శనానికి రానివ్వకుండా చేయడం ఘోరం. హంతకులు ఎవరైనా.. ఏ పార్టీవారైనా కచ్చితంగా శిక్షించాల్సిందే. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిది మందిని అరెస్టు చేయాల్సిందే. శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సిందే. పొత్తిళ్లలోని పసిగుడ్డును హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాల్సిందే. న్యాయం జరిగేదాకా పోరాటం ఆపకండి. దుర్మార్గులను శిక్షించేదాకా వదిలిపెట్టొద్దు. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిదిమందిపై హత్యానేరం మోపకపోతే శాసనసభలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. బాధిత కుటుంబాన్ని కంటికి రెప్పల కాపాడుకుంటాం. కులం, మతం లేదు.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా మేం అండగా ఉంటాం' అని కేటీఆర్ భరోసా కల్పించారు.

# ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే

## రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు నిజమే
## అయినా తానెలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడలేదు
## మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆవేదన

న్యూ యార్క్ (తెలుగోడు), ఫిబ్రవరి 25 :

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ మరోసారి వార్తల్లో నిలిచారు. అమెరికా కోర్టు ఇటీవల విడుదల చేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ పత్రాల్లో బిల్ గేట్స్ పేరు ఉండటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ విషయమై ప్రపంచ టెక్ దిగ్గజం గేట్స్ మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో తనకున్న సంబంధాలపై స్పందించిన ఆయన.. తాజాగా ఆ రహస్య ఫైళ్ల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. కానీ తాను ఏనాడూ చట్టవిరుద్ధ పనులు చేయలేదని పేర్కొన్నారు. లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో గతంలో తనకున్న సంబంధాలపై స్పందిస్తూ గేట్స్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన దాతృత్వ సంస్థ 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' ఉద్యోగులతో నిర్వహించిన ఒక ప్రత్యేక భేటీ సందర్భంగా.. ఈ అంశంపై బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు అని ఆయన అంగీకరించారు. అలాగే రష్యన్ అమ్మాయిలతో సంబంధాలున్నాయంటూ తనపై వస్తోన్న ఆరోపణలపైనా గేట్స్ స్పష్టతనిచ్చారు. ఈ సమావేశంలో గేట్స్ తన తప్పును ఒప్పుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారని వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఎప్‌స్టీన్‌తో తన సంబంధాలపై గేట్స్ ప్రస్తావిస్తూ.. 2011-14 మధ్య కాలంలో ఎప్‌స్టీన్‌ను పలుమార్లు కలిసినట్టు అంగీకరించారు. అయితే.. ఆ సమయంలో అతడికున్న క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ గురించి అంత లోతుగా తనకు తెలియదన్నారు. తన మాజీ భార్య మెలిండా గేట్స్ మొదటి నుంచీ ఎప్‌స్టీన్ విషయంలో తనను హెచ్చరించిందని.. ఆ విషయంలో మెలిండాకు క్రెడిట్ ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు గేట్స్. ప్రస్తుతం జరుగుతున్న చర్చలను బట్టిచూస్తే.. నాడు తాను చేసిన పొరపాటు నేడు వందల రెట్లు పెద్దదిగా కనిపిస్తోందని ఆయన ఆవేదన చెందారు. 'ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం నాడు నేను చేసిన అతిపెద్ద తప్పు. గేట్స్ ఫౌండేషన్ కార్య నిర్వాహకులను అతడి సమావేశాలకు తీసుకురావడమూ తప్పే. నా పొరపాటు వల్ల ఈ వివాదంలో ఇరుక్కున్న ప్రతి ఒక్కరికీ నేను క్షమాపణలు చెబుతున్నాను. మా ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని గేట్స్ చెప్పినట్టు తెలిపింది. ఫౌండేషన్ ప్రతిష్ఠ చాలా సున్నితమైనదని.. ఇలాంటి సంఘటనలు తమతో కలిసి పనిచేసే ప్రజల నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని టెక్ దిగ్గజం ఆందోళన వ్యక్తం చేశారని అందులో పేర్కొంది. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన పత్రాల్లో.. ఎప్‌స్టీన్ రాసిన కొన్ని ఇ-మెయిల్ డ్రాఫ్టులు వెలుగులోకి వచ్చాయి. అందులో బిల్ గేట్స్‌కు డ్రగ్స్ సరఫరా చేయడం సహా రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు ఏర్పాటు చేసేందుకు తాను సహకరించానని ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. ఈ ఆరోపణలను నాటి నుంచీ గేట్స్ ఖండిస్తూనే ఉన్నారు. తాను ఎలాంటి చట్టవిరుద్ధమైన పనులు చేయలేదని స్పష్టం చేశారు. ఆ ఫొటోల్లో తన పక్కన ఉన్న మహిళలు ఎప్‌స్టీన్ సహాయకులు మాత్రమేనని.. కావాలనే వారి ముఖాలకు మాస్క్ వేశారన్నారు. అలాగే ఎప్‌స్టీన్ వేధింపులకు గురైన బాధితులతో తాను ఏనాడూ సమయం కేటాయించలేదని గేట్స్ చెప్పుకొచ్చారు.

# బ్యాంకులకు ఎగవేత కేసు

## అనీల్ అంబాని నివాసం జప్తు

ముంబై (తెలుగోడు), ఫిబ్రవరి 25 :

రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ముంబైలోని ఆయన విలాసవంతమైన నివాసం 'అబోడ్' ను తాత్కాలికంగా జప్తు చేసింది. ఈ ఆస్తి విలువ రూ.3,716.83 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పాలిహిల్ ప్రాంతంలో ఉన్న ఈ భవనం 66 మీటర్ల ఎత్తు, 17 అంతస్తులతో లగ్జరీ టవర్‌గా పేరుంది. అంబానీ గ్రూప్ సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ కోట్లాది రూపాయల మేర బ్యాంకు రుణాల మోసానికి పాల్పడిన కేసులో ఈ జప్తు జరిగింది. దీంతో ఈ కేసులో ఇంతవరకూ జప్తు చేసిన అనిల్ అంబానీ ఆస్తుల విలువ రూ.15,700 కోట్లకు చేరింది. ఆర్‌సీఓఎం మోసపూరిత బ్యాంకింగ్ డీలింగ్స్‌తో ఈ తాజా ప్రాపర్టీకి సంబంధం ఉందని ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. పీఎంఎల్ఏ కింద 2025 ఆగస్టులో అంబానీ స్టేట్‌మెంట్‌ను ఈడీ రికార్డు చేసింది. త్వరలోనే మరోసారి ఆయనను ఈడీ ప్రశ్నించనుంది. అనిల్ అంబానీ ఆర్‌సీఓఎంపై తొలుత సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో దీనిపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. గత జూలైలో 35కు పైగా ప్రదేశాల్లో సోదాలు నిర్వహించింది. గ్రూప్‌లోని 50 కంపెనీలకు చెందిన 25 మందికి పైగా వ్యక్తులను ప్రశ్నించింది.

# చెవినొప్పితో ఆసుపత్రికి వెళితే ఘోరం

## డాక్టర్ల నిర్లక్ష్యంతో యువకుడి మృతి

నిజామాబాద్ (తెలుగోడు), ఫిబ్రవరి 25:

జిల్లాలో ఘోరం జరిగిపోయింది. చెవి నొప్పితో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరిన యువకుడు మృతి చెందటం తీవ్ర విషాదాన్ని నింపింది. చేతికొచ్చిన కొడుకు అర్ధంతరంగా చనిపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో హాస్పిటల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. భీంగల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన గంగం అజయ్ మంగళవారం చెవి నొప్పితో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. అజయ్ కండిషన్ చూసిన వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్ కోసం మత్తు మందు ఇచ్చిన తర్వాత అజయ్ చనిపోయాడు. దీంతో ఆస్పత్రి వైద్యులు, మత్తు వైద్యుల నిర్లక్ష్యం మూలంగా అజయ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో వెంటిలేటర్, ఎలాంటి సౌకర్యాలు లేవు అంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు. చేతికొచ్చిన కొడుకు చనిపోయాడని.. న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు హాస్పిటల్ ముందు ఆందోళనకు దిగారు. హాస్పిటల్ ఎదుటనే అజయ్ మృతదేహాన్ని దహనం చేస్తామని డీజిల్ డబ్బాతో ఆందోళనకు దిగారు కుటుంబ సభ్యులు. దీంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. వైద్యుల నిర్లక్ష్యంతో అజయ్ మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్ సమయంలో ఎక్కువ మోతాదులో మత్తు మందు ఇవ్వటం వల్లనే అజయ్ మృతి చెందారని ఆందోళనకు దిగారు. ఆ క్రమంలో పోలీసులకు, కుటుంబ సభ్యులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

# అన్నాడిఎంకే సీట్ల పంపకాలు

## నేడు చెన్నైలో పళనిస్వామితో బిజెపి నేతల చర్చలు

చెన్నై (తెలుగోడు), ఫిబ్రవరి 25 :

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అన్నాడీఎంకేతో సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలకు బీజేపీ సమాయత్తమవుతోంది. ఇరు పార్టీల మధ్య గురువారంనాడు చర్చలు జరుగనున్నాయి. ఈ చర్చలకు బీజేపీ నుంచి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సారథ్యం వహించనుండగా, అన్నాడీఎంకే నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళని స్వామి, సీనియర్ నేతలు పాల్గొనున్నారు. కాగా, 2024 ఎన్నికల్లో తమ పార్టీ సాధించిన 11 శాతం ఓట్ షేర్ ఆధారంగా బీజేపీ బేరసారాలు జరుపనున్నట్టు తెలుస్తోంది. 50 సీట్లను బీజేపీ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్డీయే కూటమిలో బీజేపీతో పాటు టీటీవీ దినకరన్ 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం' (ఏఎంఎంకే), మరో రెండు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన దినకరన్ 2018లో ఏఎంఎంకే పార్టీని స్థాపించారు. ఎన్డీయేలోకి తిరిగి రావడానికి బీజేపీనే కారణమని, ఆ పార్టీతోటే తాను సీట్ల సంప్రందింపులు సాగిస్తానని దినకరన్ స్పష్టం చేశారు. సీట్ల పంపకాలపై బీజేపీ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ, బీజేపీకి 35 సీట్లు, ఏఎంఎంకే వంటి ఇతరులకు 15 సీట్లను పార్టీ కేంద్ర నాయకత్వం కోరనుందని చెప్పారు. 2024లో పార్టీ పనితీరు ఆధారంగానే 2026 ఎన్నికల్లో సీట్ల పంపకాలు ఉండాలంటూ అన్నాడీఎంకే నాయకత్వానికి తెలియజేశామని, 2021లో ఇచ్చినట్టుగా 20 సీట్లు ఇస్తామంటే తాము అంగీకరించేది లేదని చెప్పారు. ఏఎంఎంకే 8 నుంచి 10 సీట్లలో పోటీ చేయాలనుకుంటోందని, ఏసీ షణ్ముగం 'న్యూ జస్టిస్ పార్టీ', జాన్ పాండియన్ 'తమిళగ మక్కల్ మున్నేట్ర గళం' చెరో రెండు సీట్లు ఆశిస్తున్నాయని, తక్కిన సీట్లు



ఇతర పార్టీలకు బీజేపీ కేటాయిస్తుందని చెప్పారు. కాగా, 30 సీట్లకు తాము తగ్గేది లేదని, ఏఎంఎంకే 8 సీట్లయినా కావాలని గట్టిగా చెబుతోందని, దీంతో ఎన్డీయే బ్లాక్‌కు 40-50 సీట్లు కోరనున్నామని బీజేపీకి చెందిన మరో నేత తెలిపారు. కాగా, అన్నాడీఎంకే సొంతంగా 170 సీట్లలో పోటీ చేసేందుకు పట్టుదలగా ఉంది. బీజేపీకి 25, ఎన్డీయే బ్లాక్‌కు మరో 10 సీట్లు కేటాయించగలమని చెబుతోంది. పీఎంకేకు 17 నుంచి సీట్లు, ఒక రాజ్యసభ సీటు ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. బీజేపీకి 50 సీట్లు ఇవ్వడం చాలా కష్టమని, అయితే సంప్రదింపుల్లో ఆమోదయోగ్యమైన పరిష్కారం కుదురుతుందని ఆశిస్తున్నామని అన్నాడీఎంకే సీనియర్ నేత ఒకరు తెలిపారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్-మేలో జరుగనున్నాయి.

# హైకోర్టు సీరియస్

(మొదటి పేజీ (తరువాయి)

7 గంటల్లోగా సమర్పించాలని సీఎస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు పంపినట్లు తెలిసింది. దీంతో శాఖల వారీగా అధికారులు అత్యవసరంగా చర్యలు చేపడుతున్నారు. గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనంలో లోపాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి ఈ కేసు విచారణ దశలవారీగా కొనసాగుతోంది. తాజాగా పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలను భద్రపరచాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అలాగే మూల్యాంకన ప్రక్రియలో జరిగిన అనుమానాస్పద అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు సిట్‌ను నియమించాలని ఆదేశించింది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసి విచారణ కొనసాగిస్తోంది. ఈ దర్యాప్తు పూర్తయ్యే వరకూ అప్పట్లో నియామకాలు పొందిన అధికారులను కీలక స్థానాల్లో కొనసాగించకూడదని హైకోర్టు స్పష్టం చేసినప్పటికీ ఆ ఆదేశాల అమలులో జాప్యం చోటు చేసుకోవడం వివాదాస్పదమైంది. తాజా పరిణామాల నేపథ్యంలో అధికారుల భవిష్యత్తు, సిట్ దర్యాప్తు నివేదికపై ప్రభుత్వ తదుపరి చర్యలు ఎలా ఉండబోతున్నాయన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది.

# 20 శాతం జీతాల పెంపు

(మొదటి పేజీ (తరువాయి)

విరమణ అనంతరం వారికి ఆర్థిక భరోసా మరింత పెరగనుంది. అలాగే పీఏసీఎస్ ఉద్యోగులకు కల్పిస్తున్న ఆరోగ్య బీమా సదుపాయాల్లోనూ మార్పులు చేపట్టారు. ఇకపై ప్రతి ఉద్యోగికి రూ.5 లక్షల కవరేజీతో కూడిన సమగ్ర గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ వర్తింపజేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. కుటుంబ సభ్యులకు కూడా ఈ బీమా ప్రయోజనాలు వర్తించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో వేతన పెంపు, గ్రాట్యుటీ పెంపు, ఆరోగ్య బీమా విస్తరణ అంశాలు ఉండగా, ప్రభుత్వం వాటిపై సానుకూలంగా స్పందించడం వల్ల సమ్మెకు సిద్ధమైన పీఏసీఎస్ ఉద్యోగులు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ప్రభుత్వ హామీలపై నమ్మకంతో సహకార దృక్పథంతో ముందుకు సాగాలని ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి.

# ఆడబిడ్డ నిధి అమలు

(మొదటి పేజీ (తరువాయి)

ప్రశ్నించారు. జూన్ 2024 నుంచే అమలు చేస్తామని బాండ్లు ఇచ్చారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి గుర్తుచేశారు. సభ్యుల ప్రశ్నలకు ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. సూపర్ సిక్స్ హామీలన్నింటినీ అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆడబిడ్డ నిధి పథకం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. పథకానికి సంబంధించి ఆర్థిక అంచనాలు వేస్తున్నామని, విధివిధానాలు ఖరారు చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ఇవన్నీ పూర్తయ్యాక ఇతర పథకాల తరహాలోనే దీనిని కూడా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల పింఛన్లను పెంచినట్లు మంత్రి వివరించారు. వృద్ధాప్య పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలుకు పెంచామని, ఏడాదికి సుమారు రూ.33 వేల కోట్లు పింఛన్ల రూపంలో ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. లోటు బడ్జెట్ పరిస్థితుల్లోనూ తల్లికి వందనం, పెన్షన్ పెంపు, స్త్రీశక్తి వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. మంత్రి సమాధానం ఇస్తున్న సమయంలో వైసీపీ ఎమ్మెల్సీలు సభలో ఆందోళన వ్యక్తం చేశారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టమైన తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అయితే పూర్తి స్థాయి అధ్యయనం, ఆర్థిక అంచనాలు పూర్తయ్యాకే నిర్ణయం తీసుకుంటామని మంత్రి పునరుద్ఘాటించారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం దశలవారీగా ముందుకు సాగుతోందని, ఆడబిడ్డ నిధి పథకం కూడా త్వరలోనే అమలులోకి తీసుకువస్తామని తెలిపారు.

# దివ్యాంగులకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ (తరువాయి)

ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. త్వరలో దీనికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఉచిత బస్సు పథకం కారణంగా ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం గతేడాది రూ.436 కోట్లు ఆర్థిక సాయం అందించినట్లు మంత్రి తెలిపారు. అలాగే మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని విమర్శించిన మంత్రి, ప్రస్తుతం రాష్ట్రంలోని 75 శాతం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం ఈ-బస్ సేవ పథకం ద్వారా రాష్ట్రానికి 750 కొత్త బస్సులు రానున్నాయని, సీఎన్‌జి మరియు ఎలక్ట్రిక్ బస్సుల కోసం కూడా ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి వెల్లడించారు. ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలు, దివ్యాంగులకు మరింత ఆర్థిక ఉపశమనం కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో సామాజిక భద్రత, సమాన అవకాశాల దిశగా ఇది మరో ముందడుగు అని మంత్రి పేర్కొన్నారు.

# ప్రత్యేక పూజల్లో జగన్

(మొదటి పేజీ (తరువాయి)

ప్రత్యేక పూజలు, హోమంలో జగన్ పాల్గొన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆలయానికి రూ. 1.8 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ఆరు కోట్ల రూపాయలతో దేవాలయ నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమం తర్వాత.. వైఎస్ జగన్ మధ్యాహ్నం నుంచి క్యాంపు కార్యాలయంలో ప్రజదర్బార్ నిర్వహించనున్నారు. అయితే దీనికి ముందుగా పులివెందుల నివాసం నుంచి బయలుదేరిన వైఎస్ జగన్? వైఎస్ రాజారెడ్డి సోదరిని పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు.

# న్యాయ వ్యవస్థలో అవినీతి

(మొదటి పేజీ (తరువాయి)




నేను సుమోటోగా విచారణ చేపడతాను' అని తెలిపారు. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా రాజకీయ నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు దాచిపెడుతున్నాయని ప్రశ్నించారు. ఎంపిక చేసి మరీ న్యాయవ్యవస్థనే నిలదీస్తున్నట్టు కనిపిస్తోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల న్యాయవ్యవస్థ అనే అధ్యాయాన్ని విస్తరించింది. న్యాయవ్యవస్థలో ఉన్న అవినీతి అంశాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది. విద్యార్థులు కేవలం సిద్ధాంత పరమైన అవగాహనకే పరిమితం కారాదని, వ్యవస్థలోని సవాళ్లు, లోపాలు, వాస్తవ పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్టు చెబుతోంది. లక్షలాది కేసులు, విచారణలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను పాఠ్యాంశంలో ప్రస్తావించింది. అయితే పాఠ్యాంశంలో తాజా మార్పుల వల్ల చిన్నారులలో న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన పెరగవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



కనేకల్ తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

## భూమి సమస్యకు పరిష్కారం చూపండి

### తహసీల్దార్‌కు వినతి పత్రం..

**కనేకల్ (తెలుగోడు), ఫిబ్రవరి 25 :** మండల పరిధిలోని రచ్చుమర్రి, ఆదిగానపల్లి గ్రామ రైతులు భూసమస్యలు తీర్చాలని తహసీల్దార్ బ్రహ్మయ్యకు బుధవారం వినతిపత్రం అందించారు. గ్రామంలోని ఎల్పిఎం 374 సర్వే నంబర్ 89 లో 106 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో దాదాపు 21 మంది రైతులు గత ప్రభుత్వంలో రి సర్వే చేసినప్పుడు 106 ఎకరాల భూమిని ఎల్పిఎం 374లో జాయింట్‌గా ఉంచారు. ఈ సమస్యపై పలుమార్లు ప్రజాదర్బార్‌లో వినతి పత్రం సమర్పించినా ఉపయోగం లేకపోయిందన్నారు. గతంలో ఎన్నిసార్లు చలానా కట్టినా సమస్య పరిష్కారంలో అధికారులు స్పందించలేదన్నారు. దీనిపై తహసీల్దార్ బ్రహ్మయ్య వెంటనే స్పందిస్తూ వారం రోజులలోపు సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మండల సర్వేయర్‌ను పిలిపించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కురుబ తిప్పేస్వామి, రచ్చుమర్రి సర్పంచ్ పి.రుద్రముని, ఏ.తిమ్మప్ప, రాము, శివకుమార్, మాకే ఎల్లప్ప, దుగప్ప, తిప్పేస్వామి, రైతులు పాల్గొన్నారు.

## జూనియర్స్ కబడ్డీ టోర్నమెంట్ విజేత విజన్ విద్యాసంస్థల జట్టు..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :** శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన జూనియర్స్ కబడ్డీ టోర్నమెంట్ నందు యాడికి పట్టణానికి చెందిన విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ జట్టు రాయల చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకోవడం జరిగింది . వీరికి స్టార్ పారడైజ్ యాజమాన్యం వారు బహుమతులను మరియు మెడల్స్ ని ప్రధానం చేశారు అలాగే ఈ టోర్నమెంట్లో బెస్ట్ రైడర్గా శ్రీరంగ బెస్ట్ డిపెండెర్ గా గణేష్ ఎంపికయ్యారు. పిల్లల్ని ఆద్యంతం ప్రేక్షకులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు ఉత్తేజపరిచారు వీరి ఆట తీరు చాలామందిని మంత్రముగ్ధుల్ని చేసింది భవిష్యత్తు తరానికి వీరు మంచి కబడ్డీ క్రీడాకారులుగా తయారవుతారని అందరూ చర్చించుకున్నారు.. ఈ టోర్నమెంట్ను ఘనంగా నిర్వహించినందుకు కమిటీ వారికి ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు వీరిని విజన్ విద్యాసంస్థల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.



జూనియర్ కబడ్డీ టోర్నమెంట్ విజేతగా నిలిచిన విజన్ విద్యా సంస్థ జట్టు

## శ్రీ బసవేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :** కోసిగి మండలం జంపాపురం గ్రామంలో వెలసిన శ్రీ బసవేశ్వర స్వామి వారిని బుధవారం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. బసవేశ్వర స్వామి జాతర నేపద్యంలో స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన ఎల్లమ్మ వారి పెళ్లి వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరై, నూతన వధూవరులను అక్షింతలు వేసి దీవించారు. ఈకార్యక్రమంలో యువనేత దశరథరెడ్డి,బసిరెడ్డి పాల్గొన్నారు.



జంపాపురం శ్రీ బసవేశ్వర స్వామి ని దర్శించుకున్నా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

## ఉద్యానపంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు

### మామిడి తోటల నిర్వహణ, పండ్ల సంరక్షణ కవర్ల వినియోగంపై అవగాహన.. ఉద్యాన పంటల సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన.. జిల్లా ఉద్యాన శాఖ అధికారులు..

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 25 :** ఉద్యాన పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ఉద్యాన శాఖ అధికారిని ఉమాదేవి, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దేవానంద్, ఏటీఎం ఐపి ఏపీడి ధనుంజయ్ ప్రిన్సిపల్ సైంటిస్టులు సుబ్రహ్మణ్యం చంద్రాయుడు, యుగంధర్ పేర్కొన్నారు. బుధవారం కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు నందు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి తోటల నిర్వహణ-పండ్ల సంరక్షణ కవర్ల వినియోగం, ఇతర ఉద్యాన పంటల సంరక్షణ చర్యలు మరియు డ్రిప్ ఆటోమేషన్ ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో మామిడి పంటలో హాపర్, మిలీబగ్ వంటి



రైతుల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దేవానంద్



ఉద్యాన పంటల సాగు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారిణి ఉమాదేవి

పురుగుల నియంత్రణకు సిఫార్సు చేసిన మందులను మాత్రమే ఉపయోగించాలి అని సూచించారు. అలాగే పండ్లపై ఫ్రూట్ కవర్లు ఉపయోగించడం వల్ల త్రిప్స్, ఫ్రూట్ ఫ్లై వంటి పురుగుల నుంచి రక్షణ లభించడంతో పాటు పండ్ల నాణ్యత, రంగు, మార్కెట్ విలువ పెరుగుతుందని వివరించారు. ఉద్యాన అధికారులు ఇతర ఉద్యాన పంటలైన కొబ్బరి, అరటి, ఆయిల్‌పామ్, కూరగాయలలో సమయానికి ఎరువుల వినియోగం, కలుపు నివారణ మరియు నీటి యాజమాన్యం చేపట్టాలని సూచించారు.

అనంతరం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ధనుంజయ మాట్లాడుతూ ముఖ్యంగా డ్రిప్ ఇరిగేషన్, ఆటోమేషన్ విధానం ఉపయోగించడం వల్ల నీటి ఆదా, సమయ పొదుపు మరియు అధిక దిగుబడి సాధ్యమవుతుందని తెలిపారు. రైతులు ఈ సాంకేతిక పద్ధతులను అనుసరించి మంచి నాణ్యత గల దిగుబడులు సాధించి అధిక ఆదాయం పొందాలని ఉద్యాన శాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారిని ఉమా దేవి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దేవానంద్ , ఏపీఎంఐపి ఏపీడి ధనుంజయ్ ,ప్రిన్సిపల్ సైంటిస్ట్ సుబ్రహ్మణ్యం, కృషి విజ్ఞాన కేంద్రం,కళ్యాణదుర్గం నుండి ప్రిన్సిపల్ సైంటిస్ట్ చంద్రాయుడు , హార్టికల్చర్ సైంటిస్ట్ యుగంధర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ రాజశేఖర్ , కళ్యాణదుర్గం ఉద్యాన శాఖ అధికారి కృష్ణ తేజ, కళ్యాణదుర్గం డివిజన్ రైతులు పాల్గొన్నారు.

## అంబేద్కర్, ఫాదర్ ఫెర్రర్ విగ్రహాల ఆవిష్కరణ

### బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ .. పేదల పెన్నిధి ఫాదర్ ఫెర్రర్.. ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్..

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 25 :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒకరైతే, జిల్లాలో పేద ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేసిన ఫాదర్ ఫెర్రర్ మరొకరిని, వారు పేదల గుండెల్లో నిలిచారని ఆర్డిటి సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ పేర్కొన్నారు. బుధవారం బెళుగుప్ప మండలం పరిధిలోని గంగవరం గ్రామంలోని కాలనీ లో దాతల సహకారంతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, అనంత పేదల పెన్నిధి ఫాదర్ ఫెర్రర్ విగ్రహాలను సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక నాయకులతో కలసి, ప్రత్యేక పూజలతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డిటి సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ దేశంలో బడుగు బలహీన వర్గాల కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోరాటం చేసి రాజ్యాంగాన్ని అమలు చేయడంతోనే నేడు గౌరవంగా సమాజంలో బతుకుతున్నారన్నారు.



ఆర్డిటి సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న గంగవరం గ్రామస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్

అనంతపురం జిల్లాలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేసిన ఫాదర్ ఫెర్రర్ పేదల గుండెల్లో నిలిచారన్నారు. ఫాదర్ ఫెర్రర్ జిల్లాకు వచ్చినప్పుడు పేదలకు అవసరమైన రెండు కార్యక్రమాలను ప్రారంభించారన్నారు అందులో మొదటిది పేద ప్రజలకు గంజి కేంద్రాలను ఏర్పాటు చేసి కడుపునింపారన్నారు. రెండవది రైతులకు బావలను తవ్వించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారన్నారు. అప్పట్లోనే జిల్లాలు 8 వేల భావులను రైతుల కోసం తవ్వించారని గుర్తు చేశారు. అలాగే పేదలకు అందులో ముఖ్యంగా మహిళల పేరున ఇండ్లు, విద్యాభివృద్ధి కోసం పాఠశాలలు, పేదల వైద్యం కోసం ఆసుపత్రులను నిర్మించడం జరిగిందన్నారు. జిల్లా 90 వేలకు పైగా ఇళ్లను ఇప్పటివరకు నిర్మించామన్నారు. ఆర్డిటి సంస్థ చేసే ప్రతి కార్యక్రమం పేద ప్రజల అభివృద్ధి కోసమేనన్నారు. అనంతరం నాయకులు మాజీ వైస్ ఎంపీపీ దుద్దేకుంట తిమ్మప్ప, వీరాంజనేయులు, తదితరులు మాట్లాడుతూ జిల్లా లో ఆర్డిటి సంస్థ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్,గ్రామ సర్పంచ్ రోజా, మాజీ వైస్ ఎంపీపీ దుద్దేకుంట తిమ్మప్ప, టీడీపీ నాయకులు వీరాంజనేయులు, మారుతీ ప్రసాద్,ఆర్డిటి సంస్థ రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు, వీఆర్వోలు ప్రదీప్, రాజశేఖర్, కాలనీవాసులు నారాయణ, హనుమంతరాయుడు, ఓబులేసు, గంగన్న, గోవిందరాజులు, మారెన్న రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.




గంగవరంలో అంబేద్కర్, ఫాదర్ ఫెర్రర్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఆర్డిటి సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్



శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయం హుండీ లెక్కిస్తున్న దృశ్యం

## శ్రీ భోగేశ్వరుని హుండీ లెక్కింపు

**పామిడి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :** పట్టణంలోని శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయం హుండీని బుదవారం పామిడి, నార్పల కార్యనిర్వహణాధికారులు రంగస్వామి నాయుడు, కృష్ణయ్య ఆధ్వర్యంలో లెక్కించారు. 28 మార్చి 2025 నుండి 25 ఫిబ్రవరి 2026 మధ్యకాలంలో భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కించగా రూ.1,58,811 వచ్చిందన్నారు. గత ఏడాది కంటే ఈఏడాది ఆదాయం స్వల్పంగా తగ్గినప్పటికీ 3 గ్రాముల బంగారం, 94 గ్రాముల వెండి అదనంగా రావటం గమనార్హం. ప్రతిఏటా మహాశివరాత్రి పండుగ తరువాత దేవాలయం హుండీని లెక్కించటం అనవాయితీగా వస్తుందని భక్తుల కోరికలను తీర్చే కొంగు బంగారంగా పిలువబడుతున్న శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు తరలివచ్చి పూజలు చేపడుతూ హుండీలో కానుకలను వేయటం జరుగుతుందన్నారు. హుండీని ద్వార వచ్చిన కానుకలను లెక్కించి దేవాలయ కమిటీ బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని వివరించారు. ఈకార్యక్రమంలో శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మెన్ భారతి, సభ్యులు రామలక్ష్మి, సురేష్, పవన్, రామాంజనేయులు, అర్చకులు రాముస్వామి, చంద్రస్వామి, సోమశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పప్పు సెనగ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### వ్యవసాయ అధికారి జగదీష్ బాబు..

**కనేకల్ (తెలుగోడు), ఫిబ్రవరి 25 :** రైతుల సంక్షేమం కోసం రబీలో పప్పు సెనగ పంటలు సాగు చేసిన రైతులు ప్రభుత్వం అందించే కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగపరచుకోవాలని మండల వ్యవసాయ అధికారి జగదీష్ బాబు అన్నారు. ప్రభుత్వం ఏపీ మార్కుఫెడ్ ద్వారా పప్పుసెనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. క్వింటల్ ధర రూ. 5875 కొనుగోలు చేస్తారన్నారు. పప్పుసెనగ సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు ఉన్న రైతులు తమ తమ రైతు సేవా కేంద్రాలలో ఆర్ఎస్‌కె సిబందిని సంప్రదించి సీఎంఏఐడి యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా ఉన్న ప్రతి రైతుకు కూడా ఫార్మర్ ఐడి (11 అంకెల రైతు గుర్తింపు సంఖ్య)రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్నదని,( పభుత్వం నుండి రావలసినటువంటి వివిధ పథకాలు అయినా పంటల బీమా, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ఆర్థిక సహాయం,ఇతర ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందడానికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడి తప్పనిసరి అని అన్నారు. ఈనెల 28 వరకు రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఏపీ ఎఫ్ ఆర్ ఎస్ ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రతి రైతు నమోదు చేసుకోవాలని దాని కోసం రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబర్‌తో సమీప రైతు సేవ కేంద్రాలను సంప్రదించి రైతు ఐడి నమోదు చేసుకోవాలని అన్నారు.



## విద్యార్థిని చదువుకు నిత్యసురభి సహాయం

**అనంతపురం రూరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 25 :** నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్పర్సన్ డా. ఎస్. నిర్మలమురళి ఆధ్వర్యంలో ఓ విద్యార్థిని చదువు కోసం సహాయంతో పాటు వారి కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను పుట్టినిల్లు ఆశ్రమంలో బుధవారం అందించారు. ట్రస్ట్ సభ్యులు జూటూరు కేశవ రెడ్డి ఐదవ వర్ధంతి సందర్భంగా వారి సతీమణి శ్రీమతి చంద్రకళ ఈ కార్యక్రమానికి సహాయం అందించారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ సరస్వతీ విద్యా మందిరంలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలిసి ట్రస్ట్ సభ్యుల సహకారంతో విద్యార్థినికి విద్యాసామగ్రితో పాటు నూతన దుస్తులు , ఆమె కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు అందించామన్నారు. పేదరికంతో ఏ విద్యార్థి విద్యకు దూరం కాకూడదన్న సంకల్పం అందరిలో ఉండాలన్నారు. విద్యార్థులకు సహాయం చేయటానికి దాతల సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో మరింత కృషి చేస్తామని తెలిపారు. అవసరంలోనూ ఆపదలోనూ ఉన్న ప్రతి ఒక్కరికి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేశవ్ ఉపాధ్యాయురాలు భార్గవి తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

## సీనియర్స్ కబడ్డీ టోర్నమెంట్ విజేత బెంగళూరు జట్టు

### విజేతలకు నగదు బహుమతులు అందజేత..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :** యాడికి మండల కేంద్రంలో వెలిసిన శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఓపెన్ కబడి పోటీల్లో ఫైనల్ బ్యాచ్ రసవత్తరంగా సాగింఇ. సీనియర్స్ కబడ్డీ టోర్నమెంట్ విజేతగా బెంగళూరు జట్టు నిలిచింది. వెలిగండ్ల ఆదినారాయణ, దాసరి రామచంద్ర,సుబహాన్ బద్దలరాముడు,లక్ష్మణ్ నాయక్ స్పాన్సర్ చేసిన 50, 000 ను బెంగళూరు జట్టు గెలుచుకోగా. రెండవ బహుమతిగా తిరం పురం నీలకంఠ, గుండా నారాయణస్వామి, గన్నె రమేష్ వెలిగండ్ల ఉపేంద్ర స్పాన్సర్ చేసిన రూ.40, 000 ప్యాపిలి జట్టు, మూడో బహుమతిగా లక్ష్మీ ప్రసన్న



జ్యువెలర్స్ ఓనర్ నీలూరు చంద్రశేఖర్ స్పాన్సర్ చేసిన 30 వేల రూపాయలను తమిళనాడు జట్టు, నాలుగో బహుమతిగా గంగవరం రవితేజ , ముత్తూట్ మనీ గంగాధర్, భాస్కర్ రెడ్డి స్పాన్సర్ చేసిన 20.000 రూపాయలను యాడికి జట్టు గెలుచుకున్నాయి.. అంపైర్లు, క్రీడాకారులు ఆడటానికి అనుగుణంగా మ్యాట్స్ స్పాన్సర్ చేసిన జనసేన సునీల్ ని కప్పులు అందజేసిన పారడైజ్ స్కూల్ యాజమాన్యాన్ని,భోజన వసతిని కల్పించిన లియో క్లబ్ (విశ్వం రఘు )వారిని, టీషీర్ట్స్ ధాత మణి ని, ప్రైజ్ మనీ అందజేసిన దాతలను కమిటీ సభ్యులు, కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు.



రెండవ బహుమతి గెలుచుకున్న ప్యాపిలి జట్టుకు నగదు అందుకుంటున్న దృశ్యం



కబడ్డీ పోటీల విజేత బెంగళూరు జట్టుకు 50 వేల రూపాయల నగదు అందిస్తున్న దృశ్యం




మూడవ బహుమతి గెలుచుకున్న జట్టు తమిళనాడు జట్టు నకదు అందుకుంటున్న దృశ్యం. 4 వ విజేతగా యాడికి జట్టు నగదు బహుమతి

## ఏఐఎస్‌యు జిల్లా అధ్యక్షుడిగా కనుమ దామోదర్

బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :
ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా బత్తలపల్లి గ్రామానికి చెందిన కనుమ దామోదర్ నియమితులయ్యారు.



ఈ మేరకు బుధవారం విజయవాడలో ఏఐఎస్యు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. ఇంద్రజ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కనుమ దామోదర్ మాట్లాడుతూ, జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, విద్యార్థుల గొంతుకగా ముందుండి పోరాడతానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీకి కనుమ దామోదర్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ఏఐఎస్యు ని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ నియామకంపై పలువురు విద్యార్థి నాయకులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ కనుమ దామోదర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి వెంకట బ్రహ్మం

## ఎరువుల దుకాణాల పరిశీలన

### వ్యవసాయ అధికారి వెంకట బ్రహ్మం ..

రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 24 :
మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం వ్యవసాయ అధికారి వెంకట బ్రహ్మం పరిశీలించారు. ఎరువుల ధరల పట్టికను, రికార్డులను, బిల్ రసీదులను, తదితర వాటిని తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అమ్మకాలు జరపాలని అలా కాకుండా అధిక ధరలకు విక్రయాలు జరిపితే చర్యలు తప్పవన్నారు. చీడపీడలకు అవసరమైన మందులను మాత్రమే ఇచ్చి ఎంత మోతాదులో ఎంత మందు వాడాలో రైతులకు వివరించాలన్నారు.



## జనసేన పార్టీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

### జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త రంగస్వామి

రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 24 :
పార్టీ సభ్యునిగా గుర్తింపు, గౌరవం,పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత పార్టీ కమిటీల్లో బాధ్యతలు అప్పగించేందుకు సభ్యత్వం తప్పనిసరి అని జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త రంగస్వామి తెలిపారు. సభ్యత్వం ఉన్న వారికి మాత్రమే నాయకత్వ బాధ్యతలు,నాయకత్వ ట్రైనింగ్, నాయకులుగా ఎదిగే అవకాశాలు సభ్యత్వ నమోదు వల్ల 5 లక్షల ప్రమాద బీమా ద్వారా మీ కుటుంబానికి భరోసా ఉంటుందన్నారు.ప్రమాదవశాత్తు ఆసుపత్రి పాలైతే 50 వేల వరకు మెడికల్ పాలసీ ఉంటుందని జనసేన ఉద్యమి సభ్యత్వం కొరకు కావలసిన డాక్యుమెంట్ లు ఆధార్ కార్డ్
పాస్ ఫోటో,నామిని ఆధార్ నెంబర్, సభ్యుని ఫోన్ నెంబర్ 500 రూపాయలు చెల్లించి సభ్యత్వ నమోదు చేసుకోవాలని మడకశిర నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త టి రంగస్వామి కోరారు.

## ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

ముద్దనూరు తెలుగోడు ఫిబ్రవరి 25
శరీరంపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన చంద్రశేఖర్ (37) మృతి చెందినట్లు సమాచారం. ఫిబ్రవరి 21 నుండి ఆత్మహత్య ప్రయత్నం చంద్రశేఖర్ గత నాలుగు రోజులుగా కడప రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిసింది. అయితే అధికారిక సమాచారం తెలియాల్సి ఉంది.



## శ్రీమత్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

### భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల సమన్వయం.. కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే సమీక్ష..

కదిరి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :
శ్రీమత్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను ఎటువంటి లోపాలు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ నెల 27 నుంచి మార్చి 13 వరకు 15 రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎం. శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ ప్రాంగణం, గర్భగుడి క్యూలైన్లు, ఘాట్ ప్రాంతం, ప్రధాన రహదారులు, పార్కింగ్ స్థలాలు తదితర ప్రాంతాలను పరిశీలించిన అధికారులు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు, ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో భద్రత, రాకపోకల నియంత్రణ, బ్యారికేడింగ్, అత్యవసర మార్గాలు, త్రాగునీటి సదుపాయం, వైద్య శిబిరాలు, లైటింగ్ వంటి అంశాలపై సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు 15 రోజులపాటు కొనసాగనున్నందున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ముందస్తుగా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. శాఖల మధ్య సమన్వయం కీలకమని, ఉత్సవాలను విజయవంతం చేయడంలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

తెలిపారు. ఆలయ పరిసరాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు. భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు...
ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ కదిరి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. రథోత్సవం సహా అన్ని కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ భరద్వాజ్, డీఎస్పీ శివన్నారాయణ స్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, ఆలయ ఈవో, సీఐలు నారాయణరెడ్డి, నిరంజన్ రెడ్డి, నాగేంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం. శ్యాంప్రసాద్. కదిరిడీఎస్పీ నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్ సతీష్ కుమార్

## శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఉత్సవాలు

### ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సతీమణి ఎమ్మెస్ ఉమాదేవి..

రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 24 :
బంజారాల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి ఉత్సవాలను బుధవారం బంజారాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు సతీమణి ఉమాదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి రాష్ట్ర కుంచిటి గ ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎస్ టి కమిషన్ మెంబర్ వెంకటప్ప నాయకులు పాల్గొన్నారు. మడకశిర నియోజకవర్గంలో 28 తాండాలలో ఉన్న బంజారా లందరూ కలిసి అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు క్లస్టర్ ఇంచార్జిలో కౌన్సిలర్లు కూటమి నాయకులు సేవాలాల్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టిడిపి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు సతీమణి ఉమాదేవి. ఉమాదేవిని సన్మానిస్తున్న బంజారా మహిళలు

## శ్రీ సాయి విద్యానికేతన్‌లో ఘనంగా సరస్వతీ పూజ

అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 24 :
మండల కేంద్రమైన అమరాపురం శ్రీ సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు ఘనంగా శ్రీ సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు నరేష్ బట్టర్ శ్రీ సరస్వతి చిత్రపటానికి పూలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి సరస్వతీ మంత్రాన్ని విద్యార్థుల చేత పటణం చేయించారు. శ్రీ సరస్వతి మాతకు మహా మంగళహారతి తీర్థప్రసాదాలు విద్యార్థులకు ఉపాధ్యాయులకు అందజేశారు. శ్రీ సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల1996 సంవత్సరంలో ప్రారంభమైంది. శ్రీ సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వక్కలిగా సేవా సమితి అధ్యక్షులు ప్రమీల ఎంజేరప్ప, కార్యదర్శి భాగ్యమ్మ రమేష్, పాఠశాల కరస్పాండెంట్ మంజునాథ్ మాట్లాడుతూ మార్చి 16 వ తేదీ నుండి జరగబోవు 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు బాగా చదివి వ్రాయాలని అత్యధిక మార్కులు సాధించాలని, 100% ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఉపాధ్యాయులు చేసిన అంశాలను రివిజన్ చేసుకోవాలని, ఎలాంటి తప్పులు లేకుండా బాగా పరీక్షలు రాయాలని పరీక్షలలో అనుసరించవలసిన నియమాలను వివరించారు
అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుల ఆశీర్వాదం పొందారు.. శ్రీ సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కు మంచి పేరు ప్రతిష్ఠ తీసుకొని వచ్చారని ఈ ధోరణి భవిష్యత్తులో కూడా జరుగుతుందని శ్రీ సాయి విద్యానికేత న్ పాఠశాలలో చదివిన విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, మంచి ఉద్యోగాలలో ఉన్నారని గత సంవత్సరములో 10 వ తరగతిలో విద్యార్థిని కీర్తన 584 మార్కులు మండల్ టాపర్గా నిలిచిందని, , పాఠశాల కరస్పాండెంట్ మంజునాథ్ తెలిపారు ఆహ్లాదకరమైన వాతావరణంలో పక్కా భవనంలో అర్హత గల ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్యను అందిస్తున్నామని. మండలంలో అన్ని ప్రమాణాలు కలిగిన శ్రీ సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కలిగిందన్నారు. శ్రీ సరస్వతీ పూజ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీ సాయి విద్యానికేతన్ కరస్పాండెంట్ మంజునాథ్



సరస్వతీ పూజ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు , ఉపాధ్యాయినులు



సరస్వతీ పూజ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు. 10వ తరగతి విద్యార్థులు



అసెంబ్లీలో మాట్లాడుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి

## 20 వేలలోపు వేతనాల కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

### అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి..

పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :
రూ.20 వేలలోపు వేతనం పొందుతున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ రాయితీ పథకాలు వర్తించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ఆమె ప్రస్తావించారు. ప్రభుత్వ రంగాల్లో కాంట్రాక్ట్ విధానంలో నియమితులై రూ.10 వేలలోపు వేతనం పొందుతున్న ఉద్యోగులకు ప్రస్తుతం రైతు పథకాలు సహా ఇతర సంక్షేమ పథకాలు వర్తించడం లేదని తెలిపారు. కనీసం రూ.20 వేలలోపు వేతనం పొందుతున్న వారందరికీ ప్రత్యేక రాయితీలు కల్పించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని సుమారు 50 వేల కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి, చివరకు కేవలం 3,300 మందికే పరిమితం చేసి వారినీ పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరించలేదని విమర్శించారు. దీంతో వేలాది మంది ఉద్యోగులు నష్టపోయారని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అయినా అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ దశలవారీగా క్రమబద్ధీకరించే అవకాశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను ప్రభుత్వమే ప్రైవేట్ ఏజెన్సీలకు చెల్లిస్తున్నప్పటికీ, ఆ మొత్తాలు ఉద్యోగులకు సకాలంలో పూర్తిగా అందడం లేదని తెలిపారు. ఏజెన్సీల వ్యవహారంపై కఠిన పర్యవేక్షణ నిర్వహించి, న్యాయబద్ధమైన వేతనాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాలన్నింటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సంక్షేమం, భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



పంట తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వెంకట బ్రహ్మం

## పంటపొలాల పరిశీలన

### వ్యవసాయాధికారి వెంకట బ్రహ్మం ..

రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 24 :
రోళ్ల మండలం అవనికుంట గ్రామ పరిధిలోని బోర్ బావులున్న రైతులు రబీలో సాగుచేసిన పంటలను వ్యవసాయ అధికారి వెంకట బ్రహ్మం బుధవారం పరిశీలించారు. రైతులు సాగుచేసిన రాగి,వేరుశనగ పంటల్లో అధిక దిగుబడి సాధించడానికి తీసికోవలసిన జాగ్రత్తలను వివరించారు.వేరుశెనగ పంట పరిశీలించి ఆకుమచ్చ తెగులు గుర్తించారు. నివారణ కు ఎక్సకొనాజోల్ 5 శాతం ఎస్ సి 2ఎం ఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.



ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొంటున్న మహిళా శాసనసభ్యులు

## శాసన సభ్యుల క్రీడా పోటీల్లో సింధూర రెడ్డి సత్తా..

పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 24 :
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర శాసన సభ్యుల క్రీడా పోటీల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విశేష ప్రతిభ కనబర్చారు. టెన్నికాయిట్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడల్లో చురుకుగా పాల్గొని పలు విజయాలు సాధించారు. బుధవారం జరిగిన పోటీల్లో పరిటాల సునీత, శ్రావణి, సత్యకుమార్ యాదవ్ తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పల్లా శ్రీనివాస్–సత్యకుమార్ యాదవ్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీని పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. ఇద్దరూ ప్రతీకాత్మకంగా బ్యాట్ పట్టి బంతిని ఆడుతూ ఆటగాళ్లకు ఉత్తేజం నింపారు.
త్రోబాల్ పోటీలో పరిటాల సునీత జట్టు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి జట్టు తలపడ్డాయి. ఇందులో పరిటాల సునీత జట్టు విజేతగా నిలిచింది. పల్లె సింధూర రెడ్డి జట్టు రెండో స్థానంలో నిలిచింది.
టెన్నికాయిట్ ఏకల విభాగంలో సింధూర రెడ్డి, పరిటాల సునీత మధ్య జరిగిన పోటీలో సింధూర రెడ్డి గెలుపొందారు. జంటల విభాగంలో సింధూర రెడ్డి--విజయశ్రీ జట్టు జగదీశ్వరి--పద్మశ్రీ జట్టుతో పోటీ పడి రెండో స్థానాన్ని సాధించింది.
షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో కావలి గ్రీష్మతో జరిగిన మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. గ్రీష్మ విజేతగా నిలిచింది. మరో మ్యాచ్‌లో కర్రి పద్మశ్రీతో జరిగిన పోటీలో సింధూర రెడ్డి రెండో స్థానాన్ని దక్కించుకున్నారు.
ఈ సందర్భంగా సింధూర రెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించడంలో, ఆరోగ్యాన్ని కాపాడడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజాప్రతినిధులు ఒకచోట చేరి క్రీడల్లో పాల్గొనడం స్నేహపూర్వక వాతావరణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.



త్రోబాల్ సర్వీస్ చేస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కూటమి నేతలు

# కూటమి ప్రభుత్వంలో గ్రామాల రహదారులకు మహర్దశ

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**
సీఎం చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గంలోని గ్రామాల్లో రహదారులకు మహర్దశ పట్టిందని ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పల్లి కుప్పం నుంచి పంద్యాల మడుగు వరకు 44 లక్షలు నిధులతో నూతన రోడ్డుకు భూమి పూజ చేశారు. కుప్పం కడ ద్వారా రోడ్డు నిర్మాణాలకు ప్రత్యేక నిధులను కేటాయించారు. గత వైసిపి ప్రభుత్వంలో సిసి రోడ్లు, బిటి రోడ్ల నిర్మాణాలు చేపట్టక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను సీఎం చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత మునస్వామి, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు రామ్మూర్తి, గంట్లప్ప గౌడు, గుర్రప్ప, చంద్రారెడ్డి, శ్రీనివాసులు గౌడు, రాజన్న, సత్తి, ఆదిల్, పవన్ కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.




స్వచ్ఛ రథాన్ని ప్రారంభిస్తున్న ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, తదితరులు

# పరిసరాల శుభ్రతతోనే మంచి ఆరోగ్యం

**ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ..**

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**
గ్రామాల్లోని ఇళ్ల పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వర్ణ రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణ రథం ద్వారా గ్రామాల్లో పనికిరాని ఇనుప, ప్లాస్టిక్, చెత్తాచెదార వ్యర్థాలను తీసుకొని నిత్యవసర సరుకులు తీసుకోవచ్చున్నారు. దీంతో పరిసరాలు శుభ్రతతో అనారోగ్య సమస్యలు రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఎంపీపీ సులోచన గుర్రప్ప, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, కార్యదర్శి కామరాజ్ నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, నేతలు రవి రెడ్డి, రఘు, విజయ రెడ్డి, అల్లి శీన ,అవినాష్, మంజునాథ్, పవన్ కుమార్, దయానంద తదితరులు పాల్గొన్నారు.



నర్రవాడ గోశాల గోవులకు వరిగడ్డి అందజేస్తున్న దాతలు

# నర్రవాడ గోశాల గోవులకు వరిగడ్డి అందజేత

**దాత యర్ర చిన్న బ్రహ్మయ్య..**

**ఉదయగిరి /దుత్తలూరు (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**
ఆధ్యాత్మికతతో పాటు సేవా దృక్పథాన్ని చాటుకుంటూ నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నర్రవాడ శ్రీ వెంగమాంబ పేరంటాలు దేవస్థాన గోశాలకు వరికుంటపాడు మండలం నరసింహపురం గ్రామస్తుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ టీడీపీ మండల కన్వీనర్ యర్ర చిన్న బ్రహ్మయ్య సహకారంతో బుధవారం నాడు స్థానిక భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి నాయుడు ఆధ్వర్యంలో భారీగా వరిగడ్డి అందజేశారు. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేసే చిన్న బ్రహ్మయ్య ఇప్పుడు గోమాత సంరక్షణ కోసం తన వంతు బాధ్యతగా ఈ ఉదారతను చాటుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో వరిగడ్డిని దేవస్థాన సిబ్బందికి అందజేశారు.ఈ సేవా కార్యక్రమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులు. నెల్లూరు జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి నాయుడు హాజరై గోవులకు చిన్న బ్రహ్మయ్య చేస్తున్న సేవా కార్యక్రమానికి ఆయనను అభినందించారు.ఒక రాజకీయ నాయకుడిగా, పారిశ్రామికవేత్తగా బిజీగా ఉన్నప్పటికీ,మూగజీవాల ఆకలి తీర్చాలనే సంకల్పంతో ముందుకు రావడం ఆయన సేవా గుణానికి నిదర్శనమని మేకపాటి మాల్యాద్రి నాయుడు కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా నర్రవాడ అమ్మవారి క్షేత్రంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం పట్ల స్థానిక భక్తులు ,ఆలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ చిన్న బ్రహ్మయ్య కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదోవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

**గూడూరు (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**
గూడూరు మండల పరిధిలోని కొండగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అయ్యవారి పాలెం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని , సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం పదో తరగతి లో మంచి మార్కులు సాధించిన వారికి తమ సంస్థ ద్వారా బహుమతులు అందచేస్తామన్నారు . ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన ఎగ్గిరెడ్డి విజయ కుమార్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ , హెచ్.ఎం కోటేశ్వర రావు, ప్రగతి సంస్థ సభ్యులు వాకాటి రామ్మోహన్, పయ్యావుల మురళి నాయుడు, వి ఎం సి వెంకటేశ్వర రావు , శ్యామ్ ,వెంకట రావు, డిష్ నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలా మోహన్ రెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేసిన ప్రగతి సేవ సంస్థ సభ్యులు

# హనుమాపురం గ్రామాభివృద్ధికి మరో అడుగు

**సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముఖ్యమైన అడుగు పడింది. ఉపాధి హామీ పథకం కింద నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకుడు బీపీ ఈరన్న కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బీపీ ఈరన్న మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామీణ రహదారుల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని విమర్శిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో సీసీ, బీటీ, మట్టి రోడ్ల నిర్మాణం తగిన స్థాయిలో జరగలేదని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే కూటమి, కూటమి ప్రభుత్వం అంటే అభివృద్ధి అనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సంక్షేమం – అభివృద్ధి రెండూ సమపాళ్లలో అమలవుతున్నాయని ఆయన గుర్తు చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు రాకపోకలు సౌకర్యవంతంగా మారడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజశేఖర్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీడీపీ నేత బీపీ ఈరన్న



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు బీపీ ఈరన్న

# శ్రీశైలంలో చెంచుగిరిజనులకు ఉచిత స్వర్శదర్శనం

**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**
శ్రీశైల మహా క్షేత్రంలో బుధవారం చెంచు గిరిజనులకు ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనం కల్పించారు. నిర్ణయించడం జరిగింది. ప్రతి నెల చివరి బుధవారం రోజున చెంచు గిరిజన భక్తులకు ఈ ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు. గత నెలలో ముక్కోటి ఏకాదశి రోజున ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం నాడు చెంచు భక్తులు శ్రీస్వామివార్ల స్పర్శదర్శనం ఉచితంగా దర్శించుకున్నారు.
స్థానిక మేకలబండ, హాటకేశ్వరం, సున్నిపెంటలోని చెంచుభక్తులతో పాటు పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం హనుమాపురం తాండ, మాచర్ల మండలం బోధనంపాడు, దుర్గి మండలం తేరాల నుంచి కూడా చెంచు భక్తులు శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చెంచు గిరిజనులకు దేవస్థానం ఉచిత వసతి, అల్పాహార, భోజన సదుపాయం కల్పించింది. అదేవిధంగా దర్శనానంతరం చెంచు భక్తులందరికీ దేవస్థాన అన్నపూర్ణా ప్రసాదవితరణ భవనంలో అన్నప్రసాదాలు ఏర్పాటు చేయబడ్డాయి బుధవారం ఉదయం చెంచుగిరిజన భక్తులు సంప్రదాయబద్ధంగా తప్పెట వాయిద్యాలతో, చెంచు నృత్యాలతో దర్శనానికి విచ్చేశారు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దేవస్థానం అధికారులు వారికి ఆహ్వానం పలికారు. శ్రీ భ్రమరాంబాదేవివారిని తమ కూతురిగా, శ్రీ మల్లికార్జునస్వామివారిని తమ అల్లునిడిగా భావిస్తారు. దేవస్థానంలో జరిగే ఆయా ఉత్సవాలలో గ్రామోత్సవంలో ప్రత్యేకంగా చెంచుల సంప్రదాయ నృత్యాలు ప్రదర్శిస్తుంటారు. లాగే సంక్రాంతి బ్రహ్మోత్సవాలలో దివ్య కల్యాణ మహోత్సవానికి చెంచు భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తుంటారు.
శ్రీస్వామివారి ఉచిత స్పర్శదర్శనానికి చెంచుగిరిజన భక్తులను ఎంపిక చేయడంలో స్థానిక ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి వారి సహకారాన్ని తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమములో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్ల దర్శనానికి వస్తున్న గిరిజన భక్తులు



స్వామి అమ్మవార్ల దర్శనానికి వస్తున్న గిరిజన భక్తులు

# వేడుకగా ధ్వజారోహణం

**ముక్కోటి దేవతలకు ఆహ్వానం..**

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**
యాడికి మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మొదటి రోజు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పెళ్లి కొడుకును చేసే కార్యక్రమాలు దేవస్థానం తరపున నిర్వహించారు . ఈ కార్యక్రమానికి యాడికి ఆర్యవైశ్యులు కీర్తిశేషులు దేవిశెట్టి విశ్వనాథ్ ధర్మపత్ని అనురాధ దాదాపుగా 10 లక్షల రూపాయలు విలువచేసే 60 గ్రాములకు పైగా బంగారు యజ్ఞోపవీతం అందించారు. వారిని భాజా భజంత్రీలచే ఆలయ పెద్దలు ఊరేగింపుగా శోభాయాత్రగా వారి ఇంటి నుండి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం వరకు తీసుకువచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి బంగారు యజ్ఞోపవీతం సమర్పించారు. వారికి వారి కుటుంబానికి స్వామి వారి ఆశీస్సులు ఎప్పటికీ ఉండాలని వేద పండితులు హరికృష్ణశర్మ స్వామి వారిని ఆశీర్వదించారు.

**పుష్పక విమానంలో ఊరేగిన చెన్నకేశవ స్వామి..**


బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీలక్ష్మి.భూదేవి సమేతంగా చెన్నకేశవ స్వామి పుష్పక విమానం వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు హరికృష్ణ శర్మ స్వామి భక్తులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ధ్వజ రోహణది కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అర్చకులు భక్తులు ఆధ్వర్యంలో ఉదయం నిత్య పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాభాతిక మంగళ వాయిద్య గీతా మంగళహారతులు, గంగాహారణం (బిందెసేవ) కార్యక్రమం గ్రామం నందు బలిహరణాలు భగవంతుని తిరుమజ్జ నాధులు ఆరాధన, సహస్రనామ పూజ. ఉత్సవ మూర్తులను వల్లకి యందు ఉంచి గ్రామమున ఊరేగింపు, విశ్వరూప సందర్శన మంగళహారతి, మంత్రపుష్పాల సమర్పణ ఆనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు. ధ్వజారోహణ కార్యక్రమం అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేక అర్చనలు నిర్వహించారు. రాత్రి స్వామివారిని పుష్పక విమానంలో ఉంచి చెన్నకేశవస్వామి ఆలయ వద్ద నుండి కెనరా బ్యాంక్ రోడ్డు. పాత పోలీస్ స్టేషన్ సర్కిల్ లాలాల వీధి వైశ్య వీధి. కోట వీధి, పెద్దమ్మ ఆలయం మీదుగా స్వామివారి ఆలయం వరకు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు. పెద్ద ఎత్తున భక్తులు. ప్రజలు పాల్గొన్నారు.



ధ్వజారోహణ పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు



పుష్పక విమానం ఉత్సవంలో శివలక్ష్మి చెన్నకేశవ స్వామి . స్వామివారికి ప్రత్యేక అలంకరణ



శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం. భక్తుల సందడి



కంటి రోగులకు చికిత్సలు అందిస్తున్న వైద్య సిబ్బంది

# ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**
కుప్పం పిఇఎస్ ఆసుపత్రి, విజలాపురం కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 52 మందికి కంటి చికిత్సలు అందించి మందులు ఉచితంగా అందించారు. ఇందులో 18 మందికి శాస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పూజిత, శృతి, బాలు, పిఆర్ఏ విజయ్, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఎస్పీ చేతులు మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న కోసిగి సిఐ మంజునాథ్

# కోసిగి సి.ఐ కి ఎస్పీ ప్రశంసాపత్రం

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 25 :**
ఒక మిస్టరీ కేసును ఛేదించి ముద్దాయికి జీవిత ఖైదు శిక్ష పడేలా చేసినందుకు కోసిగి సిఐ మంజునాథ్‌కు ఎస్పీ ప్రశంసాపత్రం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గోనెగండ్ల మండలం బి. అగ్రహారం గ్రామానికి చెందిన హరిజన హంద్రీ దేవదాసు బైలుప్పల గ్రామానికి చెందిన హరిజన లక్ష్మి(37)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఉండేవాడు.. కొద్దిరోజుల తర్వాత ఆమెపై దేవదాసుకు అనుమానం కలిగింది. దీంతో ఆమెతో అప్పుడప్పుడు గొడవపడుతూ ఉండేవాడు 2021 జూన్ 6వ తేదీ ఆమె బంధువుల పెళ్లికని వెళ్లి ఇంటికి రాలేదు. 13 తేదీ లక్ష్మి తల్లి కిష్టమ్మ తన కూతురు కనిపించలేదని గోనెగండ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా మహిళ మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు కేసు రిజిస్టర్ చేసిన పోలీసుల దర్యాప్తులో భాగంగా అప్పటి ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ సిఐ మంజునాథ్ కేసు దర్యాప్తు చేసి, ముద్దాయిని అదుపులోకి తీసుకొని విచారించారు. లక్ష్మిని గుంతకల్లు చర్చికి వెళదామని మోటార్ సైకిల్‌పై తీసుకొని వెళ్ళి, కసాపురం సమీపాన గల పొలాల్లో గొంతు నులిమి హత్య చేసి బైక్‌లోని పెట్రోల్‌తో ఆమెను ఆనవాళ్లు గుర్తు పట్టకుండా కాల్చి నట్లు అంగీకరించాడు. ఆమెపై ఉన్నటువంటి బంగారు , వెండి ఆభరణాలు తీసుకొని వెళ్ళినట్లు చెప్పాడు. కేసు దర్యాప్తులో భాగంగా కసాపురం దగ్గరలోని హత్యా స్థలానికి చేరుకొని, మృతురాలి పుర్రె, ఇతర శరీర భాగాల ఎముకలను గుర్తించి, సాంకేతిక ఆధారాల ద్వారా వాటిని డిఎన్ఏకు పంపించి అవి లక్ష్మివే అని గుర్తించారు. అదే విధంగా లక్ష్మి, దేవదాసు ఫోన్ డేటా ా విశ్లేషించి అన్ని రకాల ఆధారాలను కోర్టుకు సమర్పించి, అప్పటి ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ సిఐ మంజునాథ్ ముద్దాయిని అరెస్ట్ చేసి చార్జ్ షీట్ వేయగా, ఆదోని రెండవ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి .సుధా కేసును విచారించి ముద్దాయిపై నేరం రుజువైనందున జీవిత ఖైదు విధించారు. ఈ కేసులో దర్యాప్తు అధికారి కోసిగి సర్కిల్ ఇన్స్పెక్టర్, బి.ఎ.మంజునాథ్ కేసును పక్కాగా దర్యాప్తు చేసి ముద్దాయికి జీవితఖైదు పడేలా చేసినందుకు కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్, ప్రశంసాపత్రం ద్వారా ప్రత్యేకంగా అభినందించారు.



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి ఉమాదేవి

# అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**ఎమ్మెల్యే సతీమణి ఎం.ఎస్.ఉమాదేవి ..**

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 24 :**
మడకశిర పట్టణం బుళ్లసముద్రం గ్రామంలో బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు మడకశిర శాసనసభ్యులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు సతీమణి ఎమ్మెస్ ఉమాదేవి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి రాష్ట్ర కుంచిటి గ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ జిల్లా లీగల్ సెల్ రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సామాజిక పోరాటం: అంటరానితనం నిర్మూలన, దళితుల హక్కుల కోసం 'బహిష్కృత హితకారిణి సభ' స్థాపించిన అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణం: భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా వ్యవహరించి, ఆధునిక భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదు, సమాజంలోని అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఒక మహోన్నత వ్యక్తి. అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, సింగల్ విండో అధ్యక్షులు నరేష్ కన్నా, కన్వీనర్లు నాగరాజు,నాగరాజు, గుండుమల మాజీ సర్పంచ్ చంద్రప్ప, క్లస్టర్ ఇన్చార్జులు రంగే గౌడ్,జైపాల్ నాగేష్ తదితరులు





## దీపం వుండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి

నటీనటులు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు ఉన్నప్పుడే వేరే ఆదాయ మార్గాలు చూసుకోవాలని నటి తమన్నా అన్నారు. లేదంటే తర్వాత చాలా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. 15 ఏళ్ల వయసులో పరిశ్రమలోకి వచ్చిన తమన్నా 21 సంవత్సరాల నుంచి అగ్ర హీరోల సరసన నటిస్తూ మెప్పిస్తున్నారు. కొత్తగా నగల వ్యాపారాన్ని కూడా ప్రారంభించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన తండ్రి నుంచి ఆర్థిక ప్రణాళికలు నేర్చుకున్నట్లు తెలిపారు. నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నే చూసుకున్నారు. నాకు ఎంతో మద్దతు ఇస్తూ.. మార్గనిర్దేశర చేశారు. ఇప్పుడు నేను జాగ్రత్తలు తీసుకుంటూ రియల్ ఎస్టేట్, నగల వ్యాపారాలతో పాటు ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టాను. అవే నాకు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. నేను ఇలా ఆలోచించడానికి నా తండ్రే కారణం. ఆయనే వల్లే ఈ క్రమశిక్షణ నేర్చుకున్నాను. అందరికీ ఈ విషయంలో దూరదృష్టి అవసరం. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉన్నవారు అవకాశాలు ఉన్నప్పుడే సరైన మార్గాల్లో డబ్బు ఆదా చేసుకోవాలి. దాన్ని పెంచుకునే దారులు కనిపెట్టాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు‘ అని తమన్నా అన్నారు. ఇక ఈ ఏడాది తమన్నా వరుస ప్రాజెక్ట్‌లతో సందడి చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సిద్దార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె నటించిన 'వివాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' మే15న విడుదల కానుంది. అలాగే అజయ్ దేవ్‌గణ్, సంజయ్‌దత్ నటిస్తోన్న 'రేంజర్'లో తమన్నా కూడా కీలక పాత్రలో కనిపిస్తున్నట్లు సమాచారం.

## కొత్త తిరుపతిని చూస్తారు.. దర్శకుడు అజయ్ భూపతి




కొత్త తిరుపతిని చూస్తారు: దర్శకుడు అజయ్ భూపతి 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి వైవిధ్యభరితమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'శ్రీనివాస మంగాపురం' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే ఈ సినిమా గురించి ఆసక్తికరమైన అప్‌డేట్‌ను పంచుకున్నాడు దర్శకుడు అజయ్. ఈ సినిమా ద్వారా ప్రపంచానికి తెలిసిన ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతిలోని మరో కోణాన్ని, ఇప్పటివరకు ఎవరూ చూడని సరికొత్త పార్శ్వాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. మీరు ఇప్పటివరకు చూడని తిరుపతిని చూపిస్తాను.. సిద్ధంగా ఉండండి‘ అంటూ ఆయన చేసిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం ద్వారా సూపర్ స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని టాలీవుడ్‌కు హీరోగా పరిచయం అవుతుండటం విశేషం. ఆయన సరసన ప్రముఖ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్టును వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ మరియు సి.కె. పిక్చర్స్ వంటి దిగ్గజ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం తిరుపతి నేపథ్యంలో అజయ్ భూపతి శైలిలో ఎంత 'రా' అండ్ 'రస్టిక్'గా ఉండబోతుందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.................................................
.........................................................................

## ఊపేస్తున్న నాని ఆయా షేర్



ప్రస్తుతం సోషల్ మీడియాలో నేచురల్ స్టార్ నాని 'ఆయాషేర్' మేనియా ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాబోయే చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి విడుదలైన ఈ స్పెషల్ సాంగ్ అటు టాలీవుడ్‌తో పాటు ఇటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌లో రికార్డులను తిరగరాస్తోంది. ఈ పాటలో నాని చూపించిన మాస్ ఎనర్జీ మరియు సిగ్నేచర్ స్టెప్పులు చూస్తుంటే, ఆయన గత పవర్‌ఫుల్ పాత్రల ప్రభావాన్ని కూడా ఇది మించిపోయిందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి 'ఔరా ఆఫ్ ఉస్తాద్' పాట కూడా ఇటీవలే విడుదలైంది. మొదట్లో ఈ పాట ట్రెండింగ్‌లో నిలిచినప్పటికీ, నాని 'ఆయాషేర్' వచ్చిన తర్వాత సీన్ పూర్తిగా మారిపోయింది. విడుదలైన కొన్ని గంటల్లోనే 'ఆయాషేర్' పాట 'ఉస్తాద్'ను వెనక్కి నెట్టి మ్యూజిక్ సెక్షన్‌లో టాప్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో 'ఆయాషేర్ దెబ్బకి ఉస్తాద్ ఔరా గల్లంతయింది‘ అంటూ అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ అదిరిపోయే సాహిత్యం అందించారు. ఇప్పటికే ఈ పాటపై వేల సంఖ్యలో రీల్స్ వస్తుండగా, సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు అందరూ నాని మాస్ స్టెప్పులను అనుకరిస్తూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది.

## చదువులో ఇద్దరూ ఇద్దరే



టాలీవుడ్ ప్రేమజంట విజయ్ దేవరకొండ- రష్మిక మంధాన ఫిబ్రవరి 26న పెళ్లి బంధంలోకి అడుగు పెట్టబోతున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ లో వీరి వివాహ వేడుకలు జరుగుతున్నాయి. ఇప్పటికే కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి ఈ జంట అక్కడికి చేరుకుంది. ఈ నేపథ్యంలో వీరిద్దరి వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా విద్యాభ్యాసానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల్లోకి రాకముందు విజయ్, రష్మిక ఇద్దరూ తమ చదువును పూర్తి చేసి తర్వాతే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. విజయ్ దేవరకొండ తొలుత హైదరాబాద్‌లోని లోకల్ స్కూల్‌లో చదివారు. ఆ తర్వాత పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హయర్ సెకండరీ స్కూల్లో హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి వరకు చదివారు. అనంతరం హైదరాబాద్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేశారు. తర్వాత హైదరాబాద్‌లోని భద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో కామర్స్ డిగ్రీ చేశారు. డిగ్రీ పూర్తయ్యాకే సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. మొదట క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో నటించి, తరువాత 'పెళ్లిచూపులు' సినిమాతో హీరోగా గుర్తింపు పొందారు. ఇక రష్మిక మందన్న మొదట కూర్గ్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. ఆ తర్వాత గొనికొప్పలోని స్కూల్‌లో స్కూల్ ఎడ్యుకేషన్ పూర్తి చేశారు.అనంతరం బెంగుళూరులోని ఎంఎస్ రామయ్య కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ సైన్స్ అండ్ కామర్స్ లో సైకాలజీ, జర్నలిజం, ఇంగ్లీష్ లిటరేచర్‌లో డిగ్రీ చేశారు. కాలేజీ రోజుల నుంచే మోడలింగ్ ప్రారంభించిన రష్మిక, తరువాత కన్నడ చిత్రం కిరిక్ పార్టీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా సక్సెస్‌తో దక్షిణాది ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ఇలా విజయ్ ? రష్మిక ఇద్దరూ డిగ్రీ పూర్తిచేసి తర్వాతే సినిమాల్లోకి వచ్చారు. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో స్టార్ హోదాలో కొనసాగుతున్నారు. ఇప్పుడు పెళ్లి బంధంతో ఒకటవుతున్న ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి వెడ్డింగ్ ఫోటోల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చదువులోనూ మెరుపులు మెరిపించిన ఈ స్టార్ కపుల్? జీవితంలోనూ సక్సెస్ ఫుల్ జర్నీ కొనసాగించాలని ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు.

## తమిళ మూవీలో వైష్ణవి చైతన్య

తెలుగులో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన బేబి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది వైష్ణవి చైతన్య . ఈ భామ ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో మరో సినిమా చేస్తూ బిజీగా ఉంది. కాగా ఈ బ్యూటీ ఇక తమిళంలో కూడా తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయిందన్న వార్త ఒకటి ఇండస్టీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. వైష్ణవి చైతన్య, పాపులర్ కోలీవుడ్ కంపోజర్ కమ్ యాక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా తెరకెక్కబోతున్న సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తాజా కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ భామ ఇప్పటికే తమిళంలో అజిత్ కుమార్ నటించిన వలిమైలో కామియో రోల్‌లో మెరిసింది. ఇదే నిజమైతే వైష్ణవి చైతన్యకు తమిళంలో హీరోయిన్‌గా తొలి సినిమా ఇదే కానుంది. మొత్తానికి వైష్ణవి చైతన్య బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తనకంటూ స్పెషల్ ఐడెంటిటీ తెచ్చుకోవాలనే ప్రయత్నంలో బిజీగా ఉన్నట్టు తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. రానున్న రోజుల్లో వైష్ణవి చైతన్య నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.